క్లుప్తంగా...

నేడు అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రారంభం

కీసర: కీసర రైతు వేదిక కార్యాలయం వద్ద అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను గౌరవ జిల్లా న్యాయమూర్తి బి.సురేష్ ఆధ్వర్యంలో ఉదయం 8 గంటలకు ప్రారంభించనున్నట్లు కీసర మండల వ్యవసాయాధికారి మాధవిలత తెలిపారు. చట్టాలు, రైతు సంక్షేమ పథకాలు, జిల్లా వ్యవసాయశాఖ సమన్వయంతో అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. రైతులు పాల్గొనాలని ఆమె సూచించారు. రైతులు భూసమస్యలపై న్యాయ సలహాలు పొందవచ్చని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి పాల్గొంటారని ఆమె తెలిపారు.

దాతల సహకారంతో రోడ్డు నిర్మాణం



మేడ్చల్: మండలంలోని గౌడవెల్లి గ్రామంలో దాతల సహకారంతో రూ.50 లక్షలు వెచ్చించి నిర్మించిన రోడ్డును గ్రామ సర్పంచ్ సురేందర్ ముదిరాజ్ ప్రారంభించారు. గ్రామంలోని మైసమ్మ, ఇతర ఆలయాలకు భక్తులు వెళ్లేందుకు దాతల సహకారంతో రూ.50 లక్షలు సమకూర్చి సీసీ రోడ్డు నిర్మాణం చేసినట్లు ఆయన తెలిపారు. గ్రామ ప్రజల కోసం దాతలు ముందుకు రావడం హర్షణీయమని అన్నారు. దాతలు, గ్రామస్తుల సహకారంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తానని సర్పంచ్ అన్నారు.

వికలాంగులకు బస్‌పాస్‌లు



బస్‌పాస్‌లు అందజేస్తున్న చైర్ పర్సన్ పావని

ఘట్‌కేసర్: మున్సిపల్ కార్యాలయంలో వికలాంగులకు బస్‌పాస్‌లను చైర్ పర్సన్ ముల్లి పావని గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రూ.50 రుసుముతో ఏడాది పాటు ఆర్టీసీ బస్సుల్లో వికలాంగులు ఉచితంగా ప్రయాణించవచ్చని చెప్పారు. 20 మందికి ఆర్టీసీ అధికారులు జారీ చేసిన పాస్‌లను లబ్ధిదారులకు అందజేశామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు సిరాజ్, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు భేష్



దరఖాస్తులు స్వీకరిస్తున్న సర్పంచ్, నాయకులు

ఘట్‌కేసర్: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అవుషాపూర్ సర్పంచ్ కావేరి మచ్చేందర్ అన్నారు. గురువారం గ్రామంలో కేంద్ర పథకాలైన ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా, ప్రధాన మంత్రి సురక్ష యోజన వంటి పథకాలు, వాటి ప్రయోజనాలను తెలుపుతూ గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. లబ్ధిదారులతో పలు పథకాలకు దరఖాస్తు చేయించారు. ఉపసర్పంచ్ ఐలయ్య, కార్పొరేషన్ బ్యాంక్ మేనేజర్, వార్డు సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు మచ్చేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం



శిరీష(ఫైల్)

జవహర్‌నగర్: యువతి అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. దమ్మాయిగూడ న్యూభవానీనగర్‌లో బొంత రేణుక కుటుంబసభ్యులతో కలిసి నివసిస్తున్నారు. రేణుక రెండో కుమార్తె బొంత శిరీష(20) కుషాయిగూడలోని ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తోంది. బుధవారం పనికి వెళ్తున్నానని చెప్పి బయటకు వెళ్లి ఇంటికి తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు ఆమె ఆచూకీ కోసం పలుచోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మేడే వాల్ పోస్టర్ ఆవిష్కరణ

మేడ్చల్: మేడే సందర్భంగా బీఆర్ఎస్ కేవీ ఆటో యూనియన్ రూపొందించిన వాల్ పోస్టర్‌ను మంత్రి మల్లారెడ్డి ఆవిష్కరించారు. మంత్రి తన నివాసం వద్ద యూనియన్ నాయకులు రూపొందించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మేడేను ఘనంగా నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు మారయ్య, బలరాంయాదవ్, గోపాల్, విజయరావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి వర్సెస్ మాజీ ఎమ్మెల్యే

ఎమ్మెల్యే టికెట్ నాకంటే.. కాదు నాకే..

- మేడ్చల్ బీఆర్ఎస్‌లో రగులుతున్న అసమ్మతి
- ఆత్మీయ సమ్మేళనాలతో మరోసారి బయటకు..



మేడ్చల్: మంత్రి మల్లారెడ్డి వర్సెస్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిగా మేడ్చల్ బీఆర్ఎస్ పార్టీ తయారైంది. మంత్రి మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిల మధ్య పార్టీలో పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. ఇద్దరు ప్రధాన నాయకులు చెరో గ్రూపుగా మారడంతో మేడ్చల్ బీఆర్ఎస్‌లో అసమ్మతి బయటపడుతోంది. ఆత్మీయ సమ్మేళనాలతో మరోసారి ఈ విషయం బయటపడింది.

మొదటి నుంచీ ఇద్దరి మధ్య ఆధిపత్య పోరే..

2014లో మేడ్చల్ నుంచి కారు గుర్తుపై సుధీర్‌రెడ్డి పోటీ చేసి ఎమ్మెల్యేగా ఎన్నికై ఐదేళ్లు పని చేశారు. 2014 ఎన్నికల్లో మల్కాజ్‌గిరి పార్లమెంట్‌కు టీడీపీ తరఫున మంత్రి మల్లారెడ్డి ఎంపీగా పోటీ చేసి గెలుపొందారు. ఆ తర్వాత బంగారు తెలంగాణ సాధన కోసం బీఆర్ఎస్‌లో చేరారు. ఎంపీగా ఉన్న సమయంలోనే మల్లారెడ్డి మేడ్చల్ నియోజకవర్గంలో తన అనుచరుల ద్వారా విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించారు. అదే సమయంలో నాటి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి మల్లారెడ్డి మధ్య పలు మార్లు భేదాభిప్రాయాలు వచ్చినా అవి అప్పటి వరకే పరిమితమయ్యాయి.

- 2019 ఎన్నికల్లో బీఆర్ఎస్ అధిష్టానం సుధీర్‌రెడ్డిని కాదని ఎంపీగా ఉన్న మల్లారెడ్డికి టికెట్ ఇవ్వడంతో ఆయన ఎమ్మెల్యేగా పోటీ చేసి భారీ మెజార్టీతో గెలుపొందారు. ఆ సమయంలో అలకబూనిన సుధీర్‌రెడ్డిని ప్రస్తుత రైతు బంధు రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి అధిష్టానం దూతగా వచ్చి బుజ్జగించి ఆయనకు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవిని ఇచ్చి బుజ్జగించారు. ఆ తర్వాత మంత్రిగా మల్లారెడ్డి కావడం, ఆయన అర్ధ బలం ముందు సుధీర్‌రెడ్డి తట్టుకోలేకపోవడంతో ఆయన కొంతమేర వెనకడుగు వేశారు.

రంగంలోకి ఎవరు..?

వీరి మధ్య ఆధిపత్య పోరు జోరుగా ఉండటంతో అధిష్టానం మేడ్చల్ గెలుపుకోసం చురుగ్గా పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. సీఎంకు అత్యంత సన్నిహితంగా ఉండే జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును, రైతుబంధు రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డిని రంగంలోకి దించాలనే ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. మల్లారెడ్డి స్థాయిలో కాకున్నా ఇద్దరు నేతలు అర్థబలం గట్టిగా ఉన్నవారు కావడం, సీఎంకు నమ్మిన బంట్లుగా ఉండటంతో వీరిద్దరిలో ఒకరికి మేడ్చల్ బీఆర్ఎస్ టికెట్ కేటాయించే అవకాశం ఉన్నట్లు పార్టీ శ్రేణుల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి.

- ఆ తర్వాత వచ్చిన స్థానిక సంస్థల ఎన్నికల్లో సుధీర్‌రెడ్డి తన తనయుడు శరత్‌చంద్రారెడ్డిని ఘట్‌కేసర్ నుంచి పోటీలో దింపి గెలిపించుకున్నారు. అదే ఎన్నికల్లో మంత్రి మల్లారెడ్డి తన బావమరిది మద్దుల శ్రీనివాస్‌రెడ్డిని మూడు చింతలపల్లి మండలం నుంచి పోటీలో దింపగా ఆయన ఓటమిపాలయ్యారు. దీంతో సుధీర్‌రెడ్డి తనయుడు శరత్‌చంద్రారెడ్డి జెడ్పీ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. నాటి నుంచి నియోజకర్గంలో ఇద్దరి నేతల మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతూనే ఉంది. సుధీర్‌రెడ్డి తన అనుచరులతో తనకూ ఓ గ్రూపును ఏర్పాటు చేసుకోగా మంత్రి మల్లారెడ్డి తన కోటరిని ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్నారు.

ఆత్మీయ సమ్మేళనాలతో మరోసారి రచ్చ..

- బీఆర్ఎస్ నిర్వహిస్తున్న ఆత్మీయ సమ్మేళనాలతో బీఆర్ఎస్‌లో వర్గ విభేదాలు జోరుగా బయట పడ్డాయి. మొదట్లో సర్పంచ్, ఎంపీటీసీ స్థాయి, గ్రామ, వార్డుస్థాయి నాయకులు తమ అసమ్మతి వెల్లగక్కినా అది బయట పడకుండా మంత్రి తనయుడు మహేందర్‌రెడ్డి మేనేజ్ చేశారు. చాలామంది నాయకులు ఆత్మీయ సమ్మేళనాలకు డుమ్మా కొట్టినా మంత్రి బలం ముందు తమ అసమ్మతిని బహిరంగంగా వెల్లడించలేకపోయారు.
- ఆత్మీయ సమ్మేళనాలకు హాజరైన సుధీర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డిలు తమ ప్రసంగాల్లో అధిష్టానం ఎవరికి టికెట్ కేటాయించినా వారి గెలుపు కోసం అందరూ పనిచేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సుధీర్‌రెడ్డి ఈ అంశాన్ని పదేపదే నాయకుల ముందు ఉంచడంతో చిర్రెత్తిన మంత్రి మల్లారెడ్డి మేడ్చల్ మండల ఆత్మీయ సమ్మేళనంలో టికెట్ తనకు సీఎం కేసీఆర్ ఖరారు చేశారని, గెలుపు తనదేనని అన్నారు.
- ఆ తర్వాత జరిగిన బోడుప్పల్ ఆత్మీయ సమ్మేళనంలో ఇదే అంశం ఇద్దరి నేతల మధ్య అగ్గి రాజేసింది. పార్టీ ఎవరికి టికెట్ ఖరారు చేయలేదని సుధీర్‌రెడ్డి అనగా తనకే కేటాయించిందని మంత్రి మల్లారెడ్డి అనడం వారి మధ్య వాగ్వాదానికి తెరలేపింది. మొదటి నుంచీ ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకుంటున్న నేతలకు మరోసారి అవకాశం రావడంతో పార్టీ పరువును జవహర్‌నగర్ డంపింగ్ యార్డులో కలిపారు.



గౌడవెల్లిలో రంజాన్ కిట్లు అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రంజాన్ కానుకల పంపిణీ

మేడ్చల్: మండలంలోని గౌడవెల్లి గ్రామంలో ముస్లింలకు రంజాన్ కానుకలను, పండగకు అవసరమైన నిత్యావసర సరుకులను మాజీ ఎంపీపీ పద్మజగన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ తన సొంత డబ్బులతో బియ్యం, పప్పు, ఉప్పు, నూనె తదితర నిత్యావసర సరుకులను అందజేశారు. రంజాన్ పండగను ఘనంగా నిర్వహించుకోవాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పెంటమ్మ, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌కు సమచారం ఇవ్వరా...

ప్రభుత్వం అందజేస్తున్న రంజాన్ కానుకలను సర్పంచ్‌కు తెలియకుండా ఎలా పంచుతారని గ్రామ సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు సురేందర్‌ముదిరాజ్ అన్నాడు. తనను అవమానించి తనకు తెలియకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలను బీఆర్ఎస్ నాయకులు ఎలా పంపిణీ చేస్తారని, దీనిపై అధికారులకు ఫిర్యాదు చేస్తానని ఆయన తెలిపారు.

పట్టణంలోని 3, 4 వార్డుల్లో..

పట్టణంలోని 3, 4 వార్డుల్లో ఆ వార్డుల కౌన్సెలర్లు గణేష్, దేవ రంజాన్ కానుకలను పంపిణీ చేశారు. ప్రభుత్వం అందజేస్తున్న పండగ కానుకలను వారు తమ వార్డుల్లోని ముస్లింలకు అందజేశారు. 3వ వార్డు అత్వెల్లి, 4వ వార్డు కిష్టాపూర్‌లో పండగ కానుకలను అందజేశారు.

అవుషాపూర్ గ్రామంలోని షానూర్ బాబా దర్గాలో..

ఘట్‌కేసర్: మండలంలోని అవుషాపూర్ గ్రామంలోని షానూర్ బాబా దర్గాలో ముస్లింలకు గురువారం మండల బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పన్నాల కొండల్‌రెడ్డి ఇఫ్తార్ విందు ఇచ్చారు. అనంతరం రంజాన్ కిట్లను అందజేసి ఇఫ్తార్ విందు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఐలయ్య యాదవ్, నాయకులు భిక్షపతిగౌడ్, ప్రతాప్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, ముస్లింలు పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమానికి పెద్దపీట



అత్వెల్లిలో కానుకలు అందజేస్తున్న కౌన్సిలర్ దేవ



అవుషాపూర్ షానూర్ బాబా దర్గాలో ముస్లింలు, బీఆర్ఎస్ నాయకులు

కీసర: బీఆర్ఎస్ ప్రభుత్వం ముస్లింల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని నాగారం మున్సిపల్ వైస్‌చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్ అన్నారు. గురువారం రాంపల్లిలో సుమారు 100 మందికి రంజాన్ కిట్లను ఆయన పంపిణీ చేశారు. కౌన్సిలర్లు సరితారమేష్‌గౌడ్, నాగేష్, కళావతి, లక్ష్మీ, కో ఆప్షన్ సభ్యులు మహ్మద్‌షఫీ, అశోక్‌గౌడ్, మేనేజర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇఫ్తార్ విందు

మేడ్చల్: పట్టణంలోని హరి పగిడి దర్గాలో కౌన్సిలర్ కౌడె మహేష్ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. పట్టణంలోని 23వ వార్డు ముస్లింలు దర్గాలో ప్రార్థనలు చేసిన అనంతరం ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. నాయకులు మౌలానా, మహబూబ్ అలీ, లాయక్ అలీ, రఫిక్ తదితరులు పాల్గొన్నారు.



రాంపల్లిలో కిట్లను పంపిణీ చేస్తున్న మల్లేష్‌యాదవ్



ఈద్గా ప్రారంభోత్సవానికి ఆహ్వానం

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్‌లో నూతనంగా నిర్మించిన ఈద్గా ప్రారంభోత్సవానికి రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీని ఆహ్వానించారు. గురువారం మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మహమూద్ అలీని కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్‌ముదిరాజ్, ఉప్పల్ నియోజకవర్గం మైనార్టీ విభాగం అధ్యక్షుడు ఎం.కె.బద్రోద్దీన్ కలిసి ఆహ్వానించారు. రూ.52 లక్షలతో నిర్మించిన ఈద్గా ప్రారంభోత్సవానికి స్థానిక ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డితో పాటు మంత్రి మల్లారెడ్డి, మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత హాజరుకానున్నారు. కార్యక్రమంలో ఈద్గా కమిటీ సభ్యులు, ముస్లిం నేతలు పాల్గొన్నారు.



హోంమంత్రి మహమూద్ అలీని ఆహ్వానిస్తున్న బద్రోద్దీన్, ప్రవీణ్‌ముదిరాజ్

23న కీసరలో రెడ్ల ఆత్మీయ సమ్మేళనం



రెడ్ల ఆత్మీయ సమ్మేళనం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రెడ్డి ఐకేసీ సంఘం నేతలు

కీసర: 2018లో ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన రెడ్డి కార్పొరేషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌తో ఆదివారం కీసరలోని కేబీఆర్ గార్డెన్‌లో రెడ్డి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ(రెడ్డిఐకేసీ) ఆధ్వర్యంలో రెడ్ల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ మేరకు గురువారం కీసరలో రెడ్ల ఆత్మీయ సమ్మేళనం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కీసర రైతుసహకార సొసైటీ అధ్యక్షుడు రామిడి ప్రభాకర్‌రెడ్డి, కీసర రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు కందాడి సత్తిరెడ్డి, ప్రధాన కార్యదర్శి పన్నాల చిన్నబాల్‌రెడ్డి, కీసరగుట్ట రెడ్డి భవన స్థలదాత గుర్రం మల్లారెడ్డి, సంఘం నేతలు తుమ్మల మధుకర్‌రెడ్డి, కంచర్ల రవీందర్‌రెడ్డి, మల్లారెడ్డి, రామచంద్రారెడ్డి, గుర్రం లక్ష్మారెడ్డి, సోమారం సుధాకర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మహేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్లు కేటాయించాలి

- ఆర్‌జీకే కాలనీ వద్ద రిలే నిరాహార దీక్ష
- టీపీసీసీ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని అహ్మద్‌గూడ ఆర్‌జీకే కాలనీలో పంపిణీ చేయకుండా ఉన్న ఇళ్లను నిరుపేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ టీపీసీసీ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం అహ్మద్‌గూడలోని ఆర్‌జీకే కాలనీలో మున్సిపల్ మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఈగ శ్వేతరాజు ఆధ్వర్యంలో పేదలకు ఇళ్లు కేటాయించాలని చేపట్టిన రిలే నిరాహార దీక్షలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో నిరుపేదల కోసం అప్పటి సీఎం వైఎస్ ఆధ్వర్యంలో అహ్మద్‌గూడలో సుమారు 5,400 వరకు రాజీవ్ గృహకల్ప ఇళ్లను నిర్మించి పేదలకు పంపిణీ చేయగా కొన్ని ఇళ్లు మిగిలిపోయాయన్నారు. ఆ ఇళ్లను ప్రస్తుత బీఆర్ఎస్ ప్రభుత్వం, మంత్రి మల్లారెడ్డి పేదలకు పంపిణీ చేయకుండా అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి ఉద్యమకారుల ముసుగులో ఇతర ప్రాంతాలకు చెందిన అనర్హులకు ఇళ్లు కేటాయించారని మండిపడ్డారు. అధికారులు స్పందించి వెంటనే అనర్హులకు కేటాయించిన ఇళ్లను రద్దుచేసి, ఏళ్ల తరబడి ఇక్కడే అద్దె ఇళ్లలో నివాసముంటున్న నిరుపేదలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేదంటే సమస్యను టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పెద్ద ఎత్తున ప్రజల తరపున ఉద్యమం చేపడతామన్నారు. నిజమైన ఉద్యమకారులకు ప్రభుత్వం కొత్తగా రూ.5 లక్షలు వెచ్చించి ప్రభుత్వ స్థలాల్లో పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ నేతలు వరగంటి వెంకటేష్, ఏనుగు సంజీవరెడ్డి, సామల శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి శోభారాణికృష్ణారావు, బీమిడి జైపాల్‌రెడ్డి, మెరుగు సునీత, అనంతలక్ష్మీ, సునీత, శంకర్, నర్సింగ్, శ్రీనివాస్‌యాదవ్, మల్లేష్, చింత విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌జీకే కాలనీ వద్ద ధర్నాలో టీపీసీసీ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి తదితరులు

డిజిటల్ టెక్నాలజీని తెలివిగా వాడుకోవాలి

కీసర: విద్యార్థినులు తమను తాము విశ్వసించాలని, మొబైల్, సోషల్ మీడియాను వినియోగిస్తున్నప్పుడు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని రాచకొండ కమిషనరేట్ సైబర్‌క్రైమ్ డీసీపీ డా.బి.అనురాధ అన్నారు. గురువారం కీసర మండలం చీర్యాలలోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో సైబర్ నేరాలు, సైబర్ బెదిరింపు -మోసాలపై అవగాహన నిర్వహించారు. సోషల్ మీడియాతోపాటు సాధారణ జీవితంలో వ్యక్తిగత సమాచారాన్ని తెలియని వ్యక్తులతో పంచుకోవద్దని సూచించారు. ఆన్‌లైన్‌లో నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ఎక్కువ మంది బాధితులు సైబర్ నేరగాళ్ల బారిన పడుతున్నారని ఆమె అన్నారు. మెరుగైన చదువులు, ఉజ్వల భవిష్యత్‌కు ప్లాన్ చేసుకొని మొబైల్ ఫోన్లను, డిజిటల్ టెక్నాలజీని తెలివిగా ఉపయోగించుకోవాలని ఆమె సూచించారు. మల్కాజిగిరి డీసీపీ జానకీ, కళాశాల చైర్మన్ జి.రవీందర్‌రెడ్డి, కుషాయిగూడ ఏసీపీ వెంకట్‌రెడ్డి, సైబర్‌క్రైం ఏసీపీ జి.వెంకటేషం, సీఐ కిరణ్, కీసర సీఐ రఘువీర్‌రెడ్డి, ఎస్ఐ మధు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో వెలుగులు

– కార్పొరేటర్ ప్రేమల శ్రీనివాస్

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని 21వ డివిజన్‌లో జీవో-58 ద్వారా మంజూరైన పట్టాలను గురువారం కార్పొరేటర్ ప్రేమల శ్రీనివాస్ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేతల ప్రభుత్వం అన్నారు. రాష్ట్ర పథకాలు ఇతర రాష్ట్రాలకు మోడల్‌గా నిలుస్తున్నాయన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన జీవో-58 పేదల్లో వెలుగులు నింపుతోందన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్, జవహర్‌నగర్ వర్కింగ్ ప్రెసిడెంట్ సింగన్న బాలరాజు, డివిజన్ అధ్యక్షుడు జక్కుల భాస్కర్, ఉపాధ్యక్షుడు నగేష్, నాయకులు చందు, కృష్ణ, గణేష్, వాహెబ్, రుక్మొద్దీన్ కాలనీవాసులు పాల్గొన్నారు.



పట్టాలు అందజేస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్

శ్రీనిధికి అనుమతులు లేవంటూ ఆందోళన



ఆందోళన చేస్తున్న ఏబీవీపీ కార్యకర్తలు

పోచారం: యమ్నంపేట్‌లోని శ్రీనిధి యూనివర్సిటీకి ఎలాంటి అనుమతులు లేవంటూ ఏబీవీపీ కార్యకర్తలు గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎబీవీపీ ఉప్పల్ కన్వీనర్ అఖిల్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు ఎటువంటి అనుమతి తీసుకోకుండానే తరగతులు నిర్వహిస్తున్న యాజమాన్యంపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనుమతి విషయంలో ప్రొవైస్ చాన్స్‌లర్‌ను నిలదీశారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మనోహన్, సచిన్, భాను, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీపీ కో ఆర్డినేటర్ల నియామకం



ఘట్‌కేసర్: వైఎస్సార్‌టీపీ మేడ్చల్ నియోజకర్గ కో ఆర్డినేటర్‌గా పాకాల దానియేలు, పోచారం మున్సిపాలిటీ కో ఆర్డినేటర్‌గా బోడ్డు వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. ఈమేరకు నియామక పత్రాలను పార్టీ నాయకులు అందజేశారు.

బిస్లరీ కంపెనీలో అగ్ని ప్రమాదం



మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధి డబిల్‌పూర్ చౌరస్తాలోని ఆర్‌సీ బిస్లరీ(లిక్కర్) కంపెనీలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. కంపెనీ యాజమాన్యం, పోలీసుల వివరాల ప్రకారం గురువారం కంపెనీ భవనంలోని పైఅంతస్తులో ఉన్న స్టోర్ రూమ్‌లో షార్ట్ సర్క్యూట్ ఏర్పడింది. స్టోర్‌రూం పై కప్పును ఫోమ్‌షీట్స్‌తో డిజైన్ చేయడంతో వాటికి ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. దీంతో కార్మికులు వెంటనే బయటకు పరుగులు తీశారు. వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. రెండు ఫైర్ ఇంజిన్లు చేరుకోగా అప్పటికే మొదటి అంతస్తులోని భవనానికి మంటలు వ్యాపించడంతో కార్మికుల వస్తువులు, ఇతర సామాగ్రి ఆహుతయ్యాయి. ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.

ఘటనా స్థలికి పరిశీలించిన ఏసీపీ..

అగ్ని ప్రమాదం సంభవించిన ఆర్‌సీ బిస్లరీ కంపెనీని మేడ్చల్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్ఐ శంకర్‌గౌడ్ పరిశీలించారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. కార్మికులకు ఎలాంటి అపాయం కలగలేదన్నారు. ఆస్తి నష్టం వివరాలు ఇంకా తెలియరాలేదు. ప్రమాదంపై కంపెనీ యాజమాన్యం ఫిర్యాదు అందలేదని సీఐ రాజశేఖర్ రెడ్డి తెలిపారు.

2.8 కిలోల గంజాయి పట్టివేత



గంజాయిని సీజ్ చేసిన పోలీసులు

శామీర్‌పేట్: గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను శామీర్‌పేట పోలీసులు గురువారం రిమాండ్‌కు తరలించారు. శామీర్‌పేట ఎస్‌హెచ్‌ఓ సుధీర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం సాయంత్రం నల్సార్ చౌరస్తా వద్ద ఇద్దరు వ్యక్తులు ఒక బ్యాగుతో అనుమానాస్పదంగా తిరుగుతుండగా అనుమానం వచ్చి వారిని శామీర్‌పేట పోలీసులు విచారించగా బ్యాగులో గంజాయిని గుర్తించారు. మహారాష్ట్ర చంద్రపూర్ ప్రాంతానికి చెందిన హరీష్ పరోధి(22), పలాష్ సంజయ్(23) నగరంలోని ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నారని, జీతాలు చాలకపోవడంతో చంద్రపూర్‌లో ఓ గుర్తు తెలియని వ్యక్తి నుంచి గంజాయి తీసుకువచ్చి నగరంలోని మాదాపూర్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో విక్రయించేవారని తెలిపారు. శామీర్‌పేట ప్రాంతానికి 2.8 కిలోల గంజాయి తీసుకువచ్చినట్లు సీఐ సుధీర్‌కుమార్ తెలిపారు. వారి వద్ద నుంచి గంజాయితో పాటు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

పరిశోధనలు అభివృద్ధికి దోహదపడాలి



మాట్లాడుతున్న అనురాగ్ యూనివర్సిటీ వీసీ రామచంద్రం

ఘట్‌కేసర్: పీహెచ్‌డీ విద్యార్థుల నూతన పరిశోధనలు అభివృద్ధికి దోహదపడే విధంగా ఉండాలని అనురాగ్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఎస్.రామచంద్రం సూచించారు. గురువారం వెంకటాపూర్‌లోని యూనివర్సిటీలో పీహెచ్‌డీ విద్యార్థులకు ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని సమాజాన్ని పీడిస్తున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అడ్మిషన్స్ డైరెక్టర్ డా. మహీపతి శ్రీనివాస్‌రావు, ఆర్‌అండ్‌డీ డీన్ డా.ఎస్.సతీష్ కుమారన్, పీహెచ్‌డీ కో ఆర్డినేటర్ డా.రాజేష్ తుమ్మ తదితరులు పాల్గొన్నారు.